18వ వసంతంలోకి...
నేటి దినపత్రిక
సూర్య
ఎన్టీఆర్ - కృష్ణా
మంగళవారం 10 సెప్టెంబర్ 2024 | పేజీలు 8

# వెల్లువలా విరాళాలు



- వరద బాధితుల కోసం తోచిన సాయంతో ముందుకు రావాలన్న సీఎం పిలుపునకు భారీ స్పందన
- సీఎం చంద్రబాబును కలిసి పెద్ద ఎత్తున విరాళాలు అందించిన పలువురు దాతలు

2లో

## అధైర్యపడాల్సిన

# అవసరంలేదు

## నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం..



- సహాయక కార్యక్రమాల్లో మరింత ముందుకెళ్తాం
- నష్టపోయిన ప్రతి ఒక్కరికి సాయం అందించాలనే ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది
- నష్ట అంచనాలను రూపొందించేందుకు క్షేత్రస్థాయిలో ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయి
- వరద ప్రభావిత ప్రాంతం కృష్ణలంకలో పర్యటించిన మంత్రి కొలుసు పార్థసారథి

వివరాలు 7లో...



# బాధితులకు అండగా..

- అన్ని విధాలా ఆదుకోడానికి సీఎం ప్రణాళికలు అమలు చేస్తున్నారు
- రేషన్ కార్డు లేకున్నా నిత్యావసర సరకులు అందజేస్తాం
- వరద బాధితులకు మంత్రి సవిత భరోసా

7

వివరాలు 2లో

- నిత్యం ప్రజలను అప్రమత్తం చేస్తూ సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ప్రత్యేక చర్యలు
- జిల్లా యంత్రాంగం అహర్నిశలు శ్రమిస్తుంది కృష్ణాజిల్లా కలెక్టర్ డి.కే. బాలాజీ

# ముంపు ప్రాంతాల్లో..

## ఎంపీ, మంత్రులు, ఎమ్మెల్యేలు





## నిర్వాహకులదే..

# పూర్తి బాధ్యత

- అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలి
- భద్రతా చర్యలు ముందస్తుగానే చేపట్టాలి
- ప్రతి ఒక్క సమాచారాన్ని ముందస్తుగా పోలీసు వారికి తెలియజేయాలి 7
- కృష్ణాజిల్లా ఎస్పీ గంగాధర రావు

## మనసున్న నాయకుడు

# పవన్ కళ్యాణ్



- సొంత నిధులతో సాయమందించడం పవన్ కళ్యాణ్ గొప్పతనం
- వరద ప్రభావిత పంచాయతీలకు లక్ష రూపాయల పంపిణీలో ఎంపీ వల్లభనేని బాలశౌరి
- సాయం చేయడంలో ఎల్లప్పుడూ ముందుండే వ్యక్తి పవన్
- జనసేన రాష్ట్ర కార్యదర్శి మండలి రాజేష్

వివరాలు 7లో

# వెల్లువలా విరాళాలు



**వరద బాధితులను ఆదుకునేందుకు ప్రజల నుంచి అనూహ్య స్పందన**

**వరద బాధితుల కోసం తోచిన సాయంతో ముందుకు రావాలన్న సీఎం పిలుపునకు భారీ స్పందన**

**సీఎం చంద్రబాబును కలిసి పెద్ద ఎత్తున విరాళాలు అందించిన పలువురు దాతలు**

**విజయవాడ బ్యూరో, మేజర్ న్యూస్ :** వరద బాధితులను ఆదుకునేందుకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళాలు వెల్లువలా వస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాల్లో స్థిరపడిన తెలుగువారు బాధితులను ఆదుకునేందుకు తమ వంతు చేయూతనిస్తున్నారు. వరద బాధితులను అందే సహాయ చర్యలను నిత్యం పర్యవేక్షిస్తూ 9 రోజులుగా విజయవాడ కలెక్టరేట్ లోనే ఉంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసి పలువురు విరాళాల చెక్కులను అందజేశారు. దాతలకు సీఎం అభినందనలు తెలిపారు. చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో వచ్చిన వరదలతో తీవ్రంగా నష్టపోయిన బాధితులను తిరిగి సాధారణ స్థితికి చేర్చేందుకు తమ వంతు సహకారం అందిస్తున్న వారికి సీఎం కృతజ్ఞతలు తెలిపారు.

**జీఎంఆర్, ఏఐజీ హాస్పిటల్స్ విరాళాలు**

సీఎంను కలిసి విరాళాలు అందించిన వారిలో...విశాఖపట్నానికి చెందిన







జీఎమ్ఆర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చల్లా ప్రసన్న, సీఈఓ మనోమేరాయ్ రూ.2.5 కోట్లు, ఏఐజీ హాస్పిటల్స్ ఛైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వరరెడ్డి రూ.1 కోటి(ఆన్ లైన్ ట్రాన్సాక్షన్), వెల్ జాన్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ అధినేత వెలమాటి జనార్ధన్ రావు రూ.1 కోటి చెక్కులను సీఎంకు అందించారు.

మెప్మా తరపున ఐఏఎస్ తేజ్ భరత్ రూ.1 కోటి, ప్రసాద్ సీడ్స్ అధినేత ప్రసాద్ రూ.50 లక్షలు, తణుకు ఎమ్మెల్యే అరిమిల్లి రాధాకృష్ణ ఆధ్వర్యంలో సింగపూర్ ప్రవాస తెలుగువారు రూ.17 లక్షల 50 వేలు, సిద్ధార్థ మెడికల్ కాలేజీ పూర్వవిద్యార్థి డాక్టర్ అమ్మన్న రూ.15 లక్షలు, పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు రూ.10 లక్షలు, ఎన్ఆర్ఐలు సురేష్ మానుకొండ, ఉప్పు వినోద్ బాబు, వరదా అమర్ రూ.10 లక్షలు అందించారు. ఏపీ ప్రభుత్వ డాక్టర్స్ అసోసియేషన్ నుండి డాక్టర్ ఐ.బాబ్జి శ్యామ్ కుమార్ రూ.6 లక్షలు, బెస్ట్ ఆగ్రో లైఫ్ లిమిటెడ్ యాజమాన్యం సూర్యదేవరబాబు-వెంకట రమా ప్రసాద్ రూ.5 లక్షలు, వల్లూరి రవీంద్రనాథ్, తేజ్, రూ.5 లక్షలు, మండపేట నియోజవకర్గం నుండి రైస్ మిల్లర్స్ తరపున రూ.5 లక్షలు, ఛాంబరాఫ్ కామర్స్ తరపున రూ.1.5 లక్షలు, రోటరీ క్లబ్ తరపున రూ.75 వేలకు సంబంధించిన చెక్కులను ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అందించారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ రూ.5 లక్షలు, బెస్ట్ ఆగ్రోలైఫ్ లిమిటెడ్ సంస్థ రూ.5 లక్షలు, ది అలమూరు తాలూకా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ తరపున రూ.5 లక్షలు సీఎంకు అందజేశారు.

తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం రూ.4 లక్షలు, టి.సతిష్ రూ.3 లక్షలు, పాలడుగు పార్వతిదేవి రూ.3 లక్షలు, ప్రసాద్ నాయుడు రూ.2 లక్షల 116, గాంధీ-వసుమతి రూ.2 లక్షల 16లు, కొత్తపల్లి గాంధీ రూ.1 లక్ష, కెవిఎస్వీ ప్రసాద్ రూ.1 లక్ష, యలమంచిలి విమలాబాయ్ రూ.1 లక్ష, తోటకూర రాజారత్నం బాబు రూ.1 లక్ష, టి.కిషోర్ కుమార్ రూ.1,11,116లు అందించారు.

గారపాటి శ్రీలక్ష్మీ రూ.1 లక్ష, పులి వెంకటేశ్వర్లు రూ.1 లక్ష, కె.ప్రభాకర్ రావు రూ.75 వేలు, కరణం పద్మజ బంగారపు ఉంగరం, దివ్యాంగుడు వి.బాబూరావు కెఆర్ జడ్పీహైస్కూల్ ఓల్డ్ స్టూడెంట్ రూ.50 వేలు, కరుసల శైలజా రూ.50 వేలు, ఏ.బాలాజీ ప్రసాద్ రూ.50 వేలు, జీఎన్.బీ.వీ.ప్రసాద్ రావు రూ.50 వేలు, చలసాని సుబ్బారావు రూ.40 వేలు, చలసాని భార్గవి రూ.32 వేలు, జి.సాంబశివరావు రూ.10 వేలు, ఆర్.రాధాకృష్ణ రూ.10 వేలు అందించారు.

# ముంపు ప్రాంతాల్లో ఎంపీ, మంత్రులు, ఎమ్మెల్యేలు







**నిత్యం ప్రజలను అప్రమత్తం చేస్తూ సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ప్రత్యేక చర్యలు**

**జిల్లా యంత్రాంగం అహర్నిశలు శ్రమిస్తుంది**

**కృష్ణాజిల్లా కలెక్టర్ డి.కే. బాలాజీ**

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** జిల్లాలో అధిక వర్షాలు, వరదల కారణంగా ముంపు బారిన పడిన ప్రజలను జిల్లా యంత్రాంగం అహర్నిశలు శ్రమిస్తూ సంరక్షిస్తున్నదని జిల్లా కలెక్టర్ డి.కే. బాలాజీ అన్నారు. ఒకవైపు ముంపు ప్రాంతాలలో పర్యటిస్తూనే మరోపక్క ఎప్పటికప్పుడు సమావేశాలు, వీడియో కాన్ఫరెన్స్ లు నిర్వహించడంతో పాటు చరవాణి ద్వారా జిల్లా అధికారులను, క్షేత్రాధికారులను వరద సహాయక చర్యలు ముమ్మరంగా చేపట్టాలని, అప్రమత్తం చేస్తున్నారు. అదేవిధంగా రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, రాష్ట్ర గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, రాష్ట్ర బిసి సంక్షేమం, ఆర్థిక బలహీన వర్గాలు, చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్ సవిత, బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి, జిల్లా నియోజకవర్గాల శాసన సభ్యులు జిల్లాలోని ముంపు ప్రాంతాలలో పర్యటించి, నిత్యం ప్రజలను అప్రమత్తం చేస్తూ సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. లోతట్టు ప్రాంత ప్రజలను వీలుని బట్టి బస్సులు, ట్రాక్టర్లు, బోట్లలో సురక్షిత ప్రాంతాలకు తరలించి పునరావాస కేంద్రాల్లో వారికి ఉదయం అల్పాహారంతో పాటు మధ్యాహ్నం రాత్రి సమయాలలో నాణ్యమైన భోజనం, తాగునీరు ఏర్పాట్లు ఇతర వసతులు కల్పించాలని మంత్రులు, ఉన్నతాధికారులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పునరావాస కేంద్రాల వద్ద వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు అవసరమైన మందులు, వైద్య సిబ్బందితో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు.ముంపుకు గురయ్యే ప్రాంతాలలోని గర్భిణీ స్త్రీలను ముందుగానే గుర్తించి సురక్షితంగా ప్రభుత్వ ఆసుపత్రులకు చేర్చి వైద్య సేవలు అందేలా చేశారు.జిల్లాలోని 16 మండలాల్లోగల 97 గ్రామాలకు గాను, 68 గ్రామాల్లో వరద ప్రభావం చూపగా ఇప్పటివరకు 68 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి 11,287 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ప్రస్తుతం 41 పునరావాస కేంద్రాలు,41 వైద్య శిబిరాలు నడుస్తుండగా అందులో 6,666 మంది సురక్షితంగా ఉన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో పశువులకు 18.9 మెట్రిక్ టన్నుల పశుగ్రాసాన్ని ఉచితంగా పంపిణీ చేశారు జిల్లాకు 40 మంది ఎన్ డి ఆర్ ఎఫ్, ఎస్ డి ఆర్ ఎఫ్ సిబ్బందిని రప్పించి వారి ద్వారా వరద బాధిత ప్రజలకు సేవలందిస్తున్నారు.బందరు డివిజన్లోని చల్లపల్లి, నాగాయలంక, మోపిదేవి, కోడూరు, అవనిగడ్డ, పెడన మండలాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. అదేవిధంగా గుడివాడ డివిజన్లో గన్నవరం, ఉంగుటూరు, పెదపారుపూడి, నందివాడ, బాపులపాడు, గుడివాడ మండలాలు, ఉయ్యూరు డివిజన్లో పెనమలూరు, కంకిపాడు, పమిడిముక్కల, తోట్లవల్లూరు మండలాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. మండలాలకు, గ్రామాలకు ప్రత్యేక అధికారులను నియమించి ఎప్పటికప్పుడు సహాయక చర్యలు చేపట్టడంతో పాటు పునరావాస కేంద్రాల్లో కూడా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాటు చేస్తూ నిరంతర పర్యవేక్షణ చేయించారు. జల వనరుల శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ అప్రమత్తం చేసి ఎక్కడైన పంట కాలువలు, డ్రైనేజీ, కరకట్టలు తెగిన పక్షంలో వెంటనే అడ్డుకట్ట వేసే విధంగా కావలసినన్ని ఇసుక బస్తాలు సిద్ధం చేశారు.జిల్లాలో భారీ వర్షాలు మొదలైనప్పటి నుండి కలెక్టరేట్ తో పాటు రెవెన్యూ డివిజన్, మండల కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్ విభాగాలను ఏర్పాటు చేసి 24/7 విధానంలో నిరంతరం పనిచేసే విధంగా జిల్లా యంత్రాంగాన్ని సిద్ధం చేశారు. ఏ ఫోన్ కాల్ వచ్చినా సంబంధిత అధికారులకు తెలియజేసి వెంటనే తగిన చర్యలు తీసుకునేలా ఏర్పాటు చేశారు.కృష్ణా నది పరివాహక ప్రాంతాలతో సహా బుడమేరు వలన ముంపుకు గురయ్యే లోతట్టు ప్రాంతాలను ముందుగానే గుర్తించి అక్కడి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి ఒక్క ప్రాణ నష్టం కూడా జరగకుండా చేశారు.బుడమేరుపై ఉన్న 9 వంతెనల వద్ద రెవెన్యూ, పోలీసు సిబ్బందిని కాపలా ఉంచి ఏ విధమైన రాకపోకలు లేకుండా అడ్డుకొని ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా కాపాడగలిగారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మచిలీపట్నం మండలంలోని మంగినపూడి సముద్ర తీరం వద్ద గల తాళ్లపాలెం గ్రామం వైఎస్ఆర్ కాలనీ మత్స్యకారులతో మాట్లాడి వారిని ఒప్పించి విజయవాడలోని వరద ప్రభావిత ప్రాంతాలలో బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు, ఆహారాన్ని పంపిణీ చేసేందుకు సెప్టెంబర్ 1 వ తేదీ ఆదివారం అర్ధరాత్రి నుండి మేల్కొని దగ్గర ఉండి మరి 46 మరపడవలను మచిలీపట్నం నుండి విజయవాడకు తరలించేలా కృషి చేశారు. అంతేకాకుండా జిల్లాల్లో కూడా అవసరాన్ని బట్టి ఉయ్యూరుకు 12, తొట్ల వల్లూరుకు 8, గన్నవరంకు 3, పెనమలూరుకు 2 మొత్తం 25 మరపడవలను పంపించి అక్కడి లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు తీసుకున్నారు. ఇదే క్రమంలో సెప్టెంబర్ 3వ తేదీ మంగళవారం జిల్లా యంత్రాంగం, విజయవాడలో వరదల కారణంగా కొన్ని రోజుల నుంచి తాగునీరు, ఆహారం కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్న క్రమంలో వారికి అవసరమైన తాగునీరు, పాలు, బిస్కెట్లు, కొవ్వొత్తులు, అగ్గిపెట్టెలు పెద్ద మొత్తంలో సిద్ధం చేసి 12 వాహనాల్లో విజయవాడకు పంపించింది. ఆయా మెటీరియల్ కు అయిన ఖర్చును జిల్లా కలెక్టర్ తక్షణమే చెల్లింపులు చేశారు.ప్రభుత్వం ప్రకటించిన విధంగా వరద ప్రభావిత ప్రాంతాలలో నిత్యవసర సరుకులైన 25 కిలోల బియ్యం, ఒక కిలో కందిపప్పు, ఒక కిలో చక్కెర, ఒక లీటర్ పామోలిన్ నూనె, 2 కిలోల ఉల్లిపాయలు, 2 కిలోల బంగాళదుంపలు చొప్పున ఉచితంగా వరద బాధితుల కుటుంబాలకు నేరుగా అందేలా ఏర్పాట్లు చేశారు. అంతేకాకుండా ఇంటింటికి వైద్య సేవల కిట్టులను కూడా పంపిణీ చేయించారు. జిల్లాలో 266 విద్యుత్ సబ్స్టేషన్లు, ఫీడర్లు, స్తంభాలు, వర్షానికి దెబ్బతినగా వాటిని యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించడం జరిగింది.

# టెర్రరిస్టు పాలనను తలపించేలా అయిదేళ్ల వైసీపీ పాలన

**చంద్రబాబు అక్రమ అరెస్టుకు ఏడాది**

**తెలుగుదేశం పార్టీ నాయకులు, పి.వి.ఫణి కుమార్, న్యాయవాది, జీవీఎల్ నరసింహారావు**



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** సోమవారం సిడింబి అగ్రహారంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు అరెస్టు అయినప్పుడు అన్ని రాజకీయ పార్టీలు సంఘీభావం ప్రకటించాయని, దేశవ్యాప్తంగా మద్దతు పలికాయని, 70 దేశాలలో చంద్రబాబుకు సంఘీభావంగా ప్రదర్శనలు చేశారన్నారు. విడుదలైన రోజు రాజమండ్రి నుంచి విజయవాడ చేరడానికి రాత్రంతా జనం రోడ్డుపై జాగారం చేసి చంద్రబాబుకు స్వాగతం పలకడం వల్ల తెల్లవారేదాకా అంటే 12 గంటలు పట్టిందన్నారు. అరెస్ట్ అయినా ఏ రాజకీయ నేతకు ఇలాంటి సంఘీభావం లేదంటే అతిశయోక్తి కాదని వారు తెలిపారు జగన్ తన లూటీ నుండి ప్రజల దృష్టి మళ్ళించడానికి అధికారంలోకి రాగానే చంద్రబాబునాయుడు లక్ష్యంగా రాజధాని భూముల్లో ఇన్ సైడర్ ట్రేడింగ్, ఇన్నర్ రింగ్ రోడ్డు, స్కిల్ డెవలప్మెంట్ లో అక్రమాలంటూ తప్పుడు కేసులు నమోదు చేశారని వారి ఆరోపణలకు కనీస ఆధారాలు చూపలేకపోయారన్నారు. అయితే ఐదేళ్ల జగన్ పాలనలో చంద్రబాబు నాయుడు పై 12 కు పైగా తప్పుడు కేసులు నమోదు చేశారని. విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్ విభాగాధిపతిగా ఉన్న కొల్లి రఘురామిరెడ్డి, చంద్రబాబు నాయుడు, నారా లోకేష్, కొల్లు రవీంద్ర లను వేధించడమే లక్ష్యంగా పనిచేశారన్నారు.

సిట్ ఇంచార్జి రఘురామిరెడ్డిని నియమించి ఫైబర్ నెట్, స్కిల్, అమరావతి కేసుల్లో టిడిపి నేతలను వేధించేందుకు ప్రయత్నించారన్నారు అభివృద్ధి లక్ష్యంగా కూటమిపాలన కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నవ్యాంధ్రప్రదేశ్ పునర్నిర్మాణమే లక్ష్యంగా పనిచేస్తుందని. వృద్ధాప్య పింఛన్ 4000 పెంచడం 16347 ఉద్యోగాలతో మెగా డీఎస్సీ, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, అన్న క్యాంటీన్లు పునరుద్ధరణ, ప్రజా రాజధాని అమరావతి, పోలవరం నిర్మాణం, ప్రకృతి విపత్తుల సమర్థ నిర్వహణ వంటి వాటిపై దృష్టి పెట్టడం జరిగిందన్నారు. గతఐదేళ్ల జగన్ పాలన లూటీలు, నేరాలు, కక్షలకు, కార్పన్యాలతో కాలం వెలబుచ్చితే, కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా ముందుకెళుతుందని వారు తెలియజేశారు.

### కాన్సెన్సింగ్ జీసస్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో

## వరద బాధితులకు సాయం



**గన్నవరం (ఉంగుటూరు), సెప్టెంబర్ 9, మేజర్ న్యూస్ :** ఉంగుటూరు మండలం, ఎలుకపాడు గ్రామంలో బుడమేరు వరద ప్రవాహానికి నీట మునిగిన కుటుంబాలకు తన వంతు సాయంగా స్నాక్స్,ఫ్రూట్స్,వాటర్ బాటిల్స్ ను కన్సెన్సింగ్ జీసెస్ మినిస్ట్రీస్ చైర్మన్ పాస్టర్ వాసు అవాల అండ్ టీమ్ ఆదివారం రాత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వాసు పునరావాస కేంద్రాన్ని సందర్శించి, ఇంటింటికి వెళ్ళి వరద బాధితులకు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బుడమేరు ఉధృతికి ఎన్నో కుటుంబాలు నిరాశ్రయులయ్యారని వారిని ప్రతి ఒక్కరూ ఆదుకోవాలని పిలుపునిచ్చారు. సాయం అందించిన వాసు అండ్ టీమ్ కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పొలిమెట్ల శ్రీరామ్ (నాని), మాజీ సర్పంచ్ లు మున్నంగి నిరీక్షణరావు, అజ్మీర వెంకటేశ్వరరావు, ప్రొద్దుటూరి రవికుమార్, సొసైటీ మాజీ చైర్మన్ పోలిమెట్ల శ్రీధర్, పాస్టర్ మున్నంగి జాన్ పీటర్, గ్రామ పెద్దలు పులపాక సుగుణరావు, పులి శ్రీనివాసరావు, వాసు టీమ్, సంతోష్, తేజ, రాకేష్, ప్రేమ్, బాబీ, మేరీపాల్, మిఖాయేలు, జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



### తిరుపతమ్మవారిని దర్శించుకున్న ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు

**పెనుగంచిప్రోలు, సెప్టెంబర్ 9, మేజర్ న్యూస్ :** మండల కేంద్రంలో వేంచేసి ఉన్న శ్రీ గోపయ్య సమేత శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారిని ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వీర్ల శ్రీరామ్ యాదవ్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంధువుల మొక్కును తీర్చుకొను కార్యక్రమంలో అమ్మవారిని దర్శించుకోవడం జరిగిందని తెలిపారు. దేవస్థానం ఆధ్వర్యంలో సౌకర్యాలు బాగా ఉన్నాయని,తలచిన పిలిచిన పలికే శ్రీ తిరుపతమ్మ తల్లి గోపయ్య స్వామిని దర్శించుకోవడం ఎంతో సంతోషాన్ని కలుగ చేసిందని ఆయన తెలియజేశారు. ఈ సందర్భంగా దేవాలయ అర్చకులు శ్రీరామ్ యాదవ్ కు ఆశీర్వచనం చేసి స్వామి, అమ్మవారి శేషవస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంపీఏ జిల్లా కార్యదర్శి కళ్యాణపు సూర్య ప్రకాశరావు, గద్దం రాంబాబు యాదవ్, బూర యశ్వంత్ గౌడ్, దండా రామకృష్ణ, రామకృష్ణ, శ్రీను యాదవ్, శ్రీరామ్ యాదవ్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# వరద కారణంగా నష్టపోయిన కుటుంబాలకు నిత్యవసర వస్తువుల పంపిణీ





**పామర్రు సెప్టెంబర్ 9 మేజర్ న్యూస్ :** ఇటీవల వచ్చిన కృష్ణానది వరద ఉధృతి కారణంగా నష్టపోయిన తోట్లవల్లూరు మండలంలోని కనిగిరిలంక, ములకలపల్లి లంక గ్రామాల ప్రజలకు పామర్రు శాసనసభ్యుడు వర్ల కుమార్ రాజా నిత్యవసర వస్తువులు, కూరగాయలు, దుప్పట్లు పంపిణీ చేశారు.

సోమవారం ఆయా లంక గ్రామాల్లో పర్యటించిన ఆయన బాధితులను పరామర్శించారు. బాధితులను పూర్తిస్థాయిలో ఆదుకుంటామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అలాగే వరదల కారణంగా నష్టపోయిన రైతాంగాన్ని పూర్తిస్థాయిలో ఆదుకునేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని అన్నారు. ఇందు కోసం కేంద్ర ప్రభుత్వంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంప్ర దింపులు జరుపుతున్నారని కేంద్ర ప్రభుత్వ సహకారంతో నష్టపోయిన రైతాంగా న్ని పూర్తిస్థాయిలో ఆదుకుంటామని రైతులకు భరోసాని ఇచ్చారు. అలాగే ఇళ్లలోనికి నీరు వచ్చిన వారికి కూడా నష్టపరిహారం ఇచ్చేందుకు అధికారులతో సంప్రదిస్తున్నానని పూర్తిస్థాయిలో నివేదికలు అందిన అనంతరం వారిని కూడా ఆదుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వీరపనేని శివరాం, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### టాటా ప్లేలో ఎందరో మహానుభావులు




**విజయవాడ మేజర్ న్యూస్ :** సరికొత్త సెలబ్రిటీ టాక్ షో, 'ఎందరో మహానుభావులు' కార్యక్రమాన్ని టాటా ప్లే తెలుగు క్లాసిక్స్ ప్రసారం చేస్తోంది. నటుడు, రచయిత, దర్శకుడు పరుచూరి గోపాల కృష్ణ, జాతీయ చలనచిత్ర అవార్డు గ్రహీత నటి శారద, నటుడు, నిర్మాత, రాజకీయ నాయకుడు మురళీ మోహన్, దర్శకుడు, సినీ కథా రచయిత రేలంగి నరసింహారావు, తనికెళ్ల భరణి వంటి తెలుగు ఇండస్ట్రీ ప్రముఖులు, దిగ్గజాలు తమ వృత్తి జీవిత ప్రయాణాన్ని ఈ చాట్ షోలో వీక్షించవచ్చు. ఈ చాట్ షోకు ప్రముఖ తెలుగు నేపథ్య గాయని, డబ్బింగ్ కళాకారిణి సునీత ఉపద్రష్ట వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నారు. విలక్షణమైన ఈ కార్యక్రమంలో తెలుగు చలనచిత్ర పరిశ్రమలోని ప్రముఖులు తమ నైపుణ్యాలు, అనుభవాలు, జీవితంలోని ఎత్తుపల్లాల గురించి మాట్లాడతారు. ఈ కార్యక్రమం ప్రతి శని, ఆదివారాలు రాత్రి 7:30 నుంచి 8:00 వరకు కొత్త ఎపిసోడ్‌లను టాటా ప్లే తెలుగు క్లాసిక్స్ ప్రసారం చేస్తుంది.

### వరద ప్రభావిత తమ వాహనాలకు నిస్సాన్ సహాయక చర్యలు

**విజయవాడ మేజర్ న్యూస్ :** వివిధ ప్రాంతాలలో సుదీర్ఘ వరదల దృష్ట్యా వరదల వల్ల పాడయి, ప్రభావితమైన వాహనాలకు నిస్సాన్ మోటార్ ఇండియా ప్రై. లిమిటెడ్ సమగ్ర సహాయక చర్యలను అందించనున్నట్లు నిస్సాన్ మోటార్స్ డైరెక్టర్ సౌరభ్ వత్స తెలిపారు. తమ వినియోగదారులకు ఈనెల 30 వరకు ఈ సహాయ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. వరద ప్రభావిత వాహనాలతో వినియోగదారులకు సహాయం చేయడానికి నిస్సాన్ ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేసిందన్నారు. బాధిత వాహనాలను సమీపంలోని అధీకృత నిస్సాన్ సర్వీస్ వర్క్‌షాప్‌కు లాగడంతో సహా ఉచిత రోడ్‌సైడ్ అసిస్టెన్స్ (ఆర్ఎస్ఏ) సేవలను కంపెనీ అందిస్తుందన్నారు. అదనంగా, వరద-ప్రభావిత వాహనాలకు రూ. 1000 వరకు బీమా క్లెయిమ్ ప్రాసెస్ ఫీజు మినహాయింపును అందించడానికి నిస్సాన్ దాని డీలర్‌లతో సహకరిస్తోందన్నారు. ఈ చొరవ తమ బీమా క్లెయిమ్‌లను సెటిల్ చేయాలనుకునే కస్టమర్‌లపై ఆర్థిక భారాన్ని తగ్గించడం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. నిస్సాన్ మోటార్ ఇండియా ఇంజిన్ ఆయిల్ / ఆయిల్ ఫిల్టర్ రీప్లేస్‌మెంట్స్‌పై పది శాతం ప్రత్యేక ఆఫర్, ఫ్లోర్ కార్పెట్ రీప్లేస్‌మెంట్స్‌పై పది శాతం ప్రత్యేక ఆఫర్, అన్ని వరద ప్రభావిత వాహనాల కోసం అధీకృత సర్వీస్ వర్క్‌షాప్‌లలో వివరణాత్మక వాహన ఆరోగ్య తనిఖీని అందిస్తోందన్నారు. ఈ నెల లోపు అందించిన సేవల కోసం అధీకృత సర్వీస్ వర్క్‌షాప్‌లలో ఈ ప్రత్యేక ఆఫర్ అందుబాటులో ఉంటుందని చెప్పారు.

### నవంబర్‌లో అంతర్జాతీయ సహకార సదస్సు 2024

**విజయవాడ మేజర్ న్యూస్ :** అంతర్జాతీయ సహకార ఉద్యమ ప్రధాన సంస్థ అయిన ఇంటర్నేషనల్ కో ఆపరేటివ్ అలయన్స్ (ఐసీఏ) 130 సంవత్సరాల సుదీర్ఘ చరిత్రలో తొలిసారిగా ఇఫ్కో చొరవతో ఐసీఏ జనరల్ అసెంబ్లీ గ్లోబల్ కోఆపరేటివ్ కాన్ఫరెన్స్‌కు భారతదేశం ఆతిథ్యం ఇవ్వనుంది. జూన్ 28, 2023న బ్రస్సెల్స్‌లో జరిగిన ఐసీఏ బోర్డు సమావేశంలో, ఐసీఏ జనరల్ అసెంబ్లీ, గ్లోబల్ కాన్ఫరెన్స్‌ను భారతదేశంలో నిర్వహించాలని ఇఫ్కో ప్రతిపాదించిందని, దీనికి బోర్డు సభ్యులు అంగీకరించారని ఐసీఏ డీజీ జెరోయెన్ డగ్లస్ చెప్పారు. దీనిపై సోమవారం జరిగిన ప్రచార కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ యునైటెడ్ నేషన్స్ ఆర్గనైజేషన్ (యుఎన్ఓ) ప్రధాన కార్యాలయంలో జరిగిన సమావేశంలో భారతదేశంలో జరిగే గ్లోబల్ కోఆపరేటివ్ కాన్ఫరెన్స్ యు ఎన్ ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ కోఆపరేటివ్స్ 2025ను అధికారికంగా ప్రారంభించాలని నిర్ణయించిందన్నారు. కేంద్ర సహకార శాఖ మంత్రి సహా పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమానికి అతిథులుగా హాజరు కానున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ సహకార సంవత్సరం 2025 పై స్మారక స్టాంప్ కూడా విడుదల చేయబడుతుందన్నారు. నవంబర్ 25 నుండి నవంబర్ 30 వరకు భారత్ మండపం, ఐపీటీఓ, ప్రగతి మైదాన్, న్యూఢిల్లీలో నిర్వహించబడుతుందన్నారు. 'సహకార సంఘాలు అందరి శ్రేయస్సును పెంపొందిస్తాయి' అనే ప్రధాన అంశంతో ఈ కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

### నిమజ్జనం ఏర్పాట్లను పరిశీలించిన కమిషనర్



**నందిగామ, సెప్టెంబర్ 9, మేజర్ న్యూస్:** పురపాలక సంఘం పరిధిలో నివసించు ప్రజలు వినాయక చవితి పండుగ సందర్భముగా వినాయకుని నిమజ్జనమునకు కావలసిన ఏర్పాట్లు చేయుటకు మున్నేరు బ్రిడ్జి ను నందిగామ పురపాలక సంఘ కమీషనర్ ఇ.వి. రమణ బాబు,మునిసిపల్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జె.ఫణి శ్రీనివాసరావు, సబ్ ఇన్స్పెక్టర్ శాతకర్ణి పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి తగు సూచనలు జారీ చేశారు. వినాయకుని నిమజ్జనం చేయు ప్రజలు అప్రమత్తముగా తగు జాగ్రత్తలతో నిమజ్జన కార్యక్రమం నిర్వహించవలసినదిగా తెలియజేశారు.

# వరద బాధితులకు బ్లాంకెట్స్ బట్టలు పంచిపెట్టిన జిల్లా పోలీసులు









**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :** గత ఎనిమిది రోజులుగా విజయవాడ నగరంలో నీట మునిగిన ప్రాంతాలలోని ప్రజలకు/ బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం నుండి వివిధ రకాలుగా సహాయ సకారాలు అందించారు. ఈ నేపథ్యంలో ఎన్.టి.ఆర్.జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు తన వంతు సాయంగా హైదరాబాద్ లోని ఐ.టి.కంపెనీ వారితో మాట్లాడి వరదలు, అధిక వర్షాలు వలన నగర ప్రజలు ఇళ్లు నీట మునిగి అనేక ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వ, పోలీస్ యంత్రాంగాలు నిరంతరాయంగా సహాయక చర్యలు చేపట్టడం జరుగుతుందని జరిగిన విపత్తు గురించి తెలియజేయగా వారి సహకారంతో బ్లాంకెట్స్, బట్టలు, మాస్క్ లను తెప్పించి వాటిని సోమవారం అజిత్ సింగ్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలొని న్యూ రాజ రాజేశ్వరి పేట వరద బాధితులకు పోలీస్ సేవాధల్ సిబ్బందితో పంచి వాటిని పంచిపెట్టడం జరిగింది.













## నాంచారమ్మ దేవికి ప్రత్యేక పూజలు అభిషేకాలు

**మచిలీపట్నం, మేజర్ న్యూస్ :** మచిలీపట్నం మాచవరం పాత పోస్ట్ ఆఫీస్ వద్ద ఇటీవలే ప్రతిష్ఠించబడిన శ్రీ నాగ నాంచారమ్మ అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు పూజలు అభిషేకాలు నిర్వహించారు. కొరపాటి శ్రీనివాస్ శ్రీ దేవి దంపతుల ఆధ్వర్యంలో తొలి పూజలు తొలి అభిషేకాలు నిర్వహించ బడ్డాయి.తదుపరి దేవాలయాన్ని వివిధ పూలతో అలంకరించి అనంతరం వివిధ పండ్ల రసాలతో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు అనంతరం యార్లగడ్డ కుటుంబీకులు పాలపొంగళ్లు నైవేద్యాలు సమర్పించి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పరిసర ప్రాంత భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి పూజలు అభిషేకాల్లో పాల్గొన్నారు.

## టాస్క్‌ఫోర్స్ ఏడీసీపీగా ఏ.శ్రీనివాసరావు



**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన సాధారణ బదిలీల నేపథ్యంలో గుంటూరు క్రైమ్ అడిషనల్ ఎస్.పి.గా పని చేస్తున్న ఏ.శ్రీనివాసరావు ఎన్.టి.ఆర్.జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో టాస్క్ ఫోర్స్ ఏ.డి.సి.పి.గా బదిలీ అయినారు. ఈ సందర్భంగా సోమవారం టాస్క్ ఫోర్స్ వారి కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన అనంతరం పోలీస్ కమిషనర్ వారి కార్యాలయంలో నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబుని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందించారు.

## నష్టపోయిన పంట పొలాల పరిశీలన



**నందిగామ, సెప్టెంబర్ 9, మేజర్ న్యూస్ :** ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఆదేశానుసారం సోమవారం మండలంలోని కంచల గ్రామంలో నందిగామ మండల వ్యవసాయ,రెవిన్యూ అధికారులతో కలిసి కంచల్లో మునేటి వరద వల్ల పూర్తిగా నష్టపోయిన పంట పొలాలను నందిగామ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వీరంకి వీరాస్వామిన్ పరిశీలించారు.ఈ సందర్భంగా వీరాస్వామిన్ మాట్లాడుతూ వరద వల్లనష్ట పోయిన ప్రతి ఒక్క రైతు నీ ఆదుకునేందుకు శాసన సభ్యురాలు తంగిరాల సౌమ్య, విజయవాడ పార్ల మెంటు సభ్యులు కేశినేని శివనాథ్ చిన్ని తో మాట్లాడి నష్ట పరిహారం రావటా నికి కృషి చేస్తామని రైతులకు భరోసా ఇచ్చారు.ఈ యొక్క కార్యక్రమంలో కంచల గ్రామ తెలుగుదేశం పార్టీసీనియర్ నాయకులు రామిరెడ్డి సుబ్బారావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు రామిరెడ్డి శ్రీనివాసరావు, మాదాల సురేష్, పెర్నా వేణు, సీతారామయ్య, రైతులు పాల్గొన్నారు.



## వరద ముంపు ప్రాంతాలలో వరద తగ్గు ముఖం

**గన్నవరం (ఉంగుటూరు), సెప్టెంబర్ 9, మేజర్ న్యూస్ :** సోమవారం ఉంగు టూరు మండలంలో వరద ముంపు గ్రామాలను ఎం. పి.డి.ఓ టీం పరిశీలిం చారు. రెండు రోజుల్లో గ్రామాల్లో సాధారణ స్థితికి రావచ్చని తెలిపారు. గ్రా మాలలో క్లోరినేషన్ చేసిన తర్వాత మాత్రమే త్రాగునీరు ప్రజలకు అందిం చడం జరుగుతుందని, గ్రామస్తులు కాచి చల్లార్చిన నీటిని తీసుకోవాలని పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. సంబంధిత పంచాయతీ కార్యదర్శులు బ్లీచింగ్, సున్నం, ఫెన్ ఆయిల్ విస్తృతంగా ఉపయోగించి ఎక్కడ అంటువ్యాధుల ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు ఉచిత వైద్య క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని తెలియచేశారు.

# రైతన్నలను కూటమి ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుంది



**నందిగామ, సెప్టెంబర్ 9, మేజర్ న్యూస్ :** ముంపు ప్రాంతాలను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికా రులకు నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఆదేశించారు. సోమవారం గని అత్కూరు, కొత్తపేట గ్రామాల్లో సౌమ్య పర్యటించారు. ఈ క్రమంలో మాట్లాడుతూ, ప్రభుత్వ యంత్రాంగం, మంత్రులు, శాసనసభ్యులు.. బాధి తులకు భరోసా కల్పించి సహాయక కార్యక్రమాలలో నిమగ్నమయ్యారన్నారు. ఫుడ్, వాటర్ సకాలంలో అందడంపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారన్నారు. మున్నేరు కృష్ణ వరదల కారణంగా నందిగామ నియోజకవర్గంలో యేటిప ట్టులో అనేక గ్రామాలు దెబ్బతిన్నాయన్నారు. రైతులు తీవ్రంగా నష్టపోయా రని, దాదాపు 16 వేల హెక్టర్ల పంట నష్టం జరిగిందని అధికారులు వివరిం చినట్టు తెలిపారు.పత్తి, మిర్చి, మినుము, పెసర నువ్వులు ఇలా పెద్ద ఎత్తున పంట నష్టం జరిగిందని రైతన్నలెవ్వరూ అధైర్య పడవద్దని కూటమి ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉండి నష్టపరిహారం అందించే విధంగా చర్యలు తీసు కుంటుందని, జిల్లా కలెక్టర్ దృష్టికి కూడా ఈ సమస్యలన్నింటిని తీసుకెళ్తానని వారికి భరోసా ఇచ్చారు. పూర్తిగా దెబ్బతిన్న ఇళ్లను అధికారులు నమోదు చేస్తున్నారరని అన్ని విధాల అందరిని ఆదుకునే బాధ్యత కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీసుకుంటారని వారికి ధైర్యం చెప్పారు. వరదల సమయంలో విపత్కర పరిస్థితులలో నియోజకవర్గంలోని మండలా లలో, పట్టణంలో ఎక్కడికక్కడ పునరావస కేంద్రాలను ఏర్పాటు చేసి వరద బాధితులకు మౌలిక సదుపాయాలను, భోజన ఏర్పాట్లకు ఎక్కడ అంతరాయం కలగకుండా నిరంతరం పర్యవేక్షణలో నిమగ్నమై పనిచేసిన ఎన్డీఏ కూటమి నేతలు అధికారులు ప్రతి ఒక్కరికి పేరుపేరునా అభినందనలను తంగిరాల సౌమ్య తెలియజేశారు.

# ఇచ్చిన మాటకు కట్టుబడి వుండే నాయకుడు డిప్యూటీ సీఎం పవన్



## ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

**గన్నవరం, సెప్టెంబర్ 9, మేజర్ న్యూస్ :** ఇచ్చిన మాటకు కట్టుబడి వుండే నాయకుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అని గన్నవరం నియోజకవర్గం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రశంసించారు. రాష్ట్రంలో వరదల కారణంగా దెబ్బతిన్న 400 గ్రామపంచాయతీలకు ఒక్కొక్క పంచాయతీకి లక్ష రూపాయలు చొప్పున మొత్తం నాలుగు కోట్ల రూపాయలు విరాళాన్ని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం ఎనికేపాడు టంకశాల కల్యాణ మండపంనందు గన్నవరం నియోజకవర్గంలో 11 పంచాయితీలకు, మైలవరం నియోజక వర్గం లో 6 పంచాయితీలకు లక్ష చెప్పున చెక్కులను గన్నవరం నియోజకవర్గం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, తాడేపల్లిగూడెం జనసేన ఎమ్మెల్యే బోలిశెట్టి శ్రీనివాస్ పంపిణీ చేసారు. ఈ పంపిణి కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆమ్మిశెట్టి వాసు, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి అనిత బీజేపీ నేతలు ఫణి కుమార్ కూటమి నేతలు, పలు గ్రామాల సర్పంచ్ లు, గ్రామ పార్టీ పెద్దలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ మాట్లాడుతూ డిప్యూటీ సిఎం పవన్ వరద భాదితులు కోసం సొంత నిధులు కేటాయించటం అభినందనీయమని మనస్పూర్తిగా ఆయనకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు. గత సంవత్సరం ఇదే రోజున చంద్రబాబు అరెస్ట్ తెలుసుకుని ఏపీ కి వస్తుంటే పోలీసులు ఆపేశారని ఆనాడు వీరుడిలా ఎంతో పోరాడారని గుర్తు చేశారు. మే 7 న తన విజయాన్ని కాంక్షిస్తూ గన్నవరం నియోజకవర్గంలో తన కోసం ప్రచారం చేసారని చెప్పుకొచ్చారు. వైసిపి వ్యతిరేక ఓటు చీలనివ్వనన్న మాట కోసం పని చేసారని అనుకున్న లక్ష్యం పవన్ సాధించారని పేర్కొన్నారు. ఇంత మంచి చేసిన ఆయనకు కృతజ్ఞతలు కన్నా ఇంకా ఏమి చెప్పలేనన్నారు. గత ఏడాది ఇదే రోజు చంద్రబాబు ను అన్యాయం గా అరెస్ట్ చేసారని గుర్తు చేసుకున్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలు నియంతలను కాలగర్భంలో కలిపిన సంఘటనలు అనేకం గా ఉన్నాయని మాజీ ముఖ్యమంత్రి జగన్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. విజయవాడలో వరదలు వస్తే మొదటి రోజు సీఎం చంద్రబాబు ఉదయం 4:30 వరకు పని చేసారని అలాంటి ముఖ్యమంత్రి ఆంధ్రప్రదేశ్ కు ఉండటం రాష్ట్ర ప్రజలు అదృష్టమని అన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో బాధితులకు ఆహారం అందించే బాధ్యత తనకు అప్పగించారని, వరదలో చిక్కుకున్న చివరి వ్యక్తి వరకు ఆహారాన్ని అందచేసానని ఇచ్చిన బాధ్యతను సక్రమంగా చేయడం ఆనందంగా ఉందన్నారు.

అంబాపురం లో వరద వస్తుందని తెలిసి మొదటగా అక్కడికి వెళ్లిన వ్యక్తి నీ తానే అని ఉదయం 9 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు అక్కడే ఉన్నానని వరద ఎక్కువ రావడం కారణం గా కొంత మందినే రెస్క్యూ చేసి ఒడ్డు కు చేర్చమన్నారు. ఉమ్మడి కృష్ణ లో వైసిపి నుండి పోటీ చేసిన 16 మంది కనపడటం లేదని విమర్శించారు. కొన్ని కుటుంబాల్లో చెల్లి కో అన్న కో నచ్చని పరిస్థితులు ఉంటాయని కానీ తల్లి కి నచ్చని వ్యక్తి ఎవరు ఉండరని తల్లికి కూడా నచ్చని వ్యక్తి జగన్మోహన్ రెడ్డి అని విమర్శలు చేశారు. పోలవరం మట్టి దోచిన వ్యక్తులకు బుడమేరు బాధితుల ఉసురు తప్పకుండా తగలకుండా పోదని స్పష్టం చేశారు. ఊహించని విధంగా ప్రజలు మాకు విజయాన్ని అందచేశారని విజయాన్ని గర్వంగా భావించకుండా బాధ్యత గా పని చేస్తున్నామని పేర్కొన్నారు. గత పాలన లో ఎమ్మెల్యేలు మంత్రులు వెదవలు లాగ మాట్లాడారని నేడు ప్రజలకు కష్టాలొస్తే వారు ఎక్కడున్నారని ప్రశ్నించారు. నా మీద పోటీ చేయండి నా మీద పోటీ చేయండి అని పవన్ ను చంద్రబాబును విమర్శించిన వారు ఎక్కడ ఉన్నారని మాజీ మంత్రులను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష హోదా ఇవ్వలేదని ప్రజల మీద జగన్ కక్ష కట్టారని అన్నారు. జగన్ కు ప్రతిపక్ష హోదా కూడా రాదని మొదటి గా చెప్పిన వ్యక్తి ని తానే అని చెప్పుకొచ్చారు. విజయవాడ ఎయిర్పోర్ట్ ను ప్రక్షాళన చేస్తానని గన్నవరం దశ దిశ మార్చుతా రాసిపెట్టుకోండి అంటూ ధీమా వ్యక్తం చేశారు.



# దీక్షా దక్షితలు ఉన్న నాయకుడు చంద్రబాబు

## చంద్రబాబును అక్రమ అరెస్ట్ చేసిన దుర్ధినం నేటికి సంవత్సరం

### మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** దీక్షా దక్షితలు ఉన్న ప్రజా నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని మాజీ ఎంపీ కొనకళ్ళ నారాయణరావు అన్నారు. సోమవారం పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని అక్రమ అరెస్టు చేసి నేటికి సంవత్సరం అయిందని, దీక్షా దక్షతలు ఉన్న నాయకుడు కాబట్టే కూటమిగా ఏర్పడి జగన్ ప్రభుత్వానికి ప్రతిపక్ష హోదా లేకుండా చేసిన ఘనత సాధించారని అన్నారు. దాదాపు 40 సంవత్సరాలు రాజకీయ అనుభవం ఉన్న అపర చాణిక్యుడు చంద్రబాబు అన్నారు. దాదాపు 70 దేశాలు చంద్రబాబు అరెస్టును ఖండించాయని, అప్పటి వైసీపీ ప్రభుత్వం 3000 కోట్ల అవినీతి అని ఆరోపణలు చేసి,అన్యాయంగా జైలులో పెట్టి, మూడు పైసలు అవినీతిని కూడా నిరూపించలేక బొక్క బోర్లా పడిందన్నారు. చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ పవన్ కళ్యాణ్ ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొని, రాజమండ్రి సెంట్రల్ జైలు కి వెళ్లడం జరిగిందని, చంద్రబాబును ఆప్యాయంగా పరామర్శించి, తన మద్దతు ప్రకటించడం పట్ల కూడా నారాయణరావు హర్షం వ్యక్తం చేశారు. నేటి వరదలకు మూల కారణం అప్పటి జగన్ ప్రభుత్వ అసమర్ధ నిర్ణయాలేనని అన్నారు. నేడు చంద్రబాబు బుడమేరుకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తులు చేయించడం హర్షించదగ్గ విషయం అన్నారు. చంద్రబాబు మొక్కవోని ఆత్మస్థైర్యంతో 74 సంవత్సరాల వయసులో కూడా గత పది రోజులుగా వరద ప్రభావిత ప్రాంతాలలో నిర్విరామంగా పర్యటిస్తూ ప్రజల్లో మనోధైర్యాన్ని నింపుతూ, వారిలో అచంచల ఆత్మవిశ్వాసాన్ని కలిగిస్తున్నారన్నారు.బాబుని అక్రమంగా అరెస్టు చేసి 53 రోజులు జైల్లో పెట్టిన పర్యవసానమే జగన్మోహన్ రెడ్డి వైయస్సార్ పార్టీ అత్యంత ఘోరంగా 11 సీట్లు మాత్రమే దక్కించుకున్నాయని అన్నారు. కార్యదీక్షపరుడు, అచంచల ఆత్మవిశ్వాసంతో ఉత్సాహంలో మూడు పదుల వయసు వారి లాగా నిర్విరామంగా వరద బాధితుల సేవలో పనిచేస్తు తరిస్తున్న ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో బిజెపి జనసేనలు సంయుక్తంగా చంద్రబాబుకు మద్దతు పలికి ప్రజలకు సుపరిపాలన అందించాలని లక్ష్యంతో పనిచేయడం ఆనందదాయకంగా ఉందన్నారు. చంద్రబాబు జైలుకు వెళ్లి వచ్చిన తర్వాత ఆరోగ్యం దెబ్బతిందని, అయినా ఆత్మవిశ్వాసంతో ఆయన వరద ప్రభావిత ప్రాంతాల్లో పని చేయడం ప్రజాభిమానాన్ని చూరగుంటోందన్నారు. చంద్రబాబుకి జైలులో ప్రాణహాని తలపెట్టాలన్న కుట్ర కోణాలు ఏమైనా దాగి ఉన్నాయేమో విచారణ కూడా చేయాలన్నారు. చంద్రబాబు పవన్ కళ్యాణ్ లు, రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో పరుగులు పెట్టిస్తున్నారన్నారు. కూటమి నాయకత్వంలో ప్రభుత్వ పరిపాలన పారదర్శకంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు కొనకళ్ళ జగన్నాథరావు(బుల్లయ్య), మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, కృష్ణా జిల్లా తెలుగు రైతు అధ్యక్షులు గోపు సత్యనారాయణ, టిడిపి పార్లమెంటరీ పార్టీ జిల్లా నాయకులు పివి ఫణి కుమార్, నరేష్, లంకి శెట్టి నీరజ, తదితరులు పాల్గొన్నారు.



## లైఫ్ జాకెట్లను ఐఓసిఎల్ ఉచితంగా అందజేయడం అభినందనీయం

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** వరదల్లో రక్షణ కోసం ఉపయోగించే లైఫ్ జాకెట్లను ఐఓసిఎల్ ఉచితంగా అందజేయడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌కు చెందిన డివిజనల్ బిజినెస్ హెడ్ లక్ష్మణ రావు 100 లైఫ్ జాకెట్లను జిల్లా కలెక్టర్కు అందజేశారు. వరదలో ప్రజల ప్రాణాలను కాపాడేందుకు లైఫ్ జాకెట్లు ఎంతగానో ఉపయోగపడతాయని అటువంటి లైఫ్ జాకెట్లను అందజేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన ఐఓసీఎల్ యాజమాన్యం వారిని జిల్లా కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ చంద్రశేఖర్, కె ఆర్ ఆర్ సి ఎస్ డి సి జి. శ్రీదేవి, కనెక్ట్ ఆంధ్ర ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ ప్రసాద్, సిపిఓ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## కానూరులో శానిటేషన్ చేపించిన కృష్ణాజిల్లా తెలుగు రైతు అధ్యక్షులు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** బందరు మండలం కానూరు పంచాయితీ లో ఉన్న గ్రామాలన్నిటికి కృష్ణాజిల్లా తెలుగు రైతు అధ్యక్షులు గోపు సత్యనారాయణ బ్లీచింగ్ చల్లించారు. గత పది రోజులు గా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రజలకు అంటువ్యాధులు ప్రబలకుండ, దోమల నివారణకు బ్లీచింగ్ చల్లించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప, గోపు వెంకట రమణ, బోలిశెట్టి నాని, పీత రాము, బొమ్మిడి ఏడుకొండలు, గోపు నరేష్, దివి మహేష్,వీర చిన్ని, బోలిశెట్టి రంగా, ఈవన సత్యనారాయణ, ఈవన వెంకన్న, మోపిదేవి కృష్ణా తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదిక 19 ఫిర్యాదులు



**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :** సోమవారం పోలీస్ కమిషనర్ వారి కార్యాలయంలో ఎన్.టీ.ఆర్.జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ఆదేశాలు మేరకు ట్రాఫిక్ డి.సి.పి. ఎం.కృష్ణమూర్తి నాయుడు "ప్రజా సమస్యల పరిష్కార వేదిక"( పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం) కార్యక్రమాన్ని నిర్వహించి బాధితులు నుండి వివిధ సమస్యలకు సంబంధించి మొత్తం 19 ఫిర్యాదులపై భాదితులతో మాట్లాడటంతో పాటుగా, దివ్యాంగులు, వృద్ధుల వద్దకు నేరుగా వెళ్లి వారి సమస్యలు గురించి అడిగి తెలుసుకుని వాటిని త్వరితగతిన పరిష్కరించాలని ఫోన్ ద్వారా సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్.ఓ లతో మాట్లాడి సత్వరమే చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. అందిన ఫిర్యాదుల్లో నగదు లావాదేవీలకు సంబంధించినవి 5, భార్యాభర్తలు, కుటుంబ కలహాలకు సంబంధించినవి 3, భూవివాదాలకు సంబంధించినవి 2, వివిధ మోసాలకు సంబంధించినవి 3, ఇతర చిన్న చిన్న వివాదాలు సమస్యలకు, సంఘటనలకు సంబంధించినవి 6, మొత్తం 19 ఫిర్యాదులును స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ డి.సి.పి.శ్రీ ఎం.కృష్ణమూర్తి నాయుడు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొని ఫిర్యాదులు పరిష్కరించుటలో సహకారాన్ని అందించారు.

## బుడమేరు ప్రవాహిక ప్రాంతాలలో రెడ్ అలెర్ట్

### లోతట్టు ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజలు సురక్షిత ప్రదేశాలకు తరలి రావాలి

### విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర ఆదేశాలు

**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** బుడమేరు ప్రవాహిక ప్రాంతాల్లో లోతట్టు ప్రదేశాలలో నివసిస్తున్న ప్రజలు వరద ముంపు ఉండటం వలన వెంటనే సురక్షిత ప్రదేశాలకు తరలిరావాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర సోమవారం ఉదయం ఆదేశాలు జారీ చేశారు. పరీవాహక ప్రాంతంలో నిరంతరయంగా భారీ వర్షాలు కురుస్తుండటంతో, భారీ వర్షపాతం అంచనా వేసినందున, బుడమేరు నదికి ఎప్పుడైనా ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం ఉందని బుడమేరు ప్రవాహిక ప్రాంతాల్లో లోతట్టు ప్రదేశాలలో నివసిస్తున్న ప్రజలు వెంటనే సురక్షితమైన ప్రదేశాలకు తరలిరావాలన్నారు. ఇరిగేషన్ శాఖ వారి సూచనల ప్రకారం విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న బుడమేరు ప్రవాహిక ప్రాంతాలైన గుణదల, సింగనగర్, పరిసర ప్రాంతాలు వరద ముంపుకు గురయ్యే అవకాశం ఉన్నందున అక్కడ నివసిస్తున్న ప్రజలందరూ వెంటనే సురక్షితమైన ప్రదేశాలకి తరలి రావాలి అని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర ఆదేశించారు.

## జనసేన ఆధ్వర్యంలో భోజనాలు ఏర్పాటు



**పామర్రు సెప్టెంబర్ 9 మేజర్ న్యూస్ :** జనసేన పార్టీ పామర్రు నియోజకవర్గ ఇన్చార్జ్ తాడిశెట్టి నరేష్ ఆధ్వర్యంలో దేవరపల్లిలోని పునరావాస కేంద్రంలో ఉన్న బాధితులకు భోజనం సమకూర్చారు. ధూళిపూడి పాలెం జనసేన, టిడిపి కార్యకర్తలు కాకర్ల అభిలాష్ యూత్ ఆధ్వర్యంలో 250 మందికి భోజనం వసతిని కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తాడిశెట్టి నరేష్ బాధితులకు భోజనం అందించారు. ఈ కార్యక్రమంలో పమిడిముక్కల మండలం జనసేన పార్టీ అధ్యక్షులు సనక కిరణ్, తోట్లవల్లూరు మండలం ఉపాధ్యక్షులు తోట గోపి, మండల ప్రధాన కార్యదర్శి బరమా అశోక్‌లతో పాటు కొప్పరాతి శ్రీకాంత్,దేవరపల్లి అనిల్, లంక బాజీ తదితరులు పాల్గొని సహకారం అందించారు.

## ఎమ్మెల్యే సౌమ్యను కలిసిన రూరల్ పోలీస్ అధికారులు



**నందిగామ, సెప్టెంబర్ 9, మేజర్ న్యూస్:** పట్టణంలోని కాకాని నగర్ ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యని రూరల్ సిఐ చౌహాన్, ఎస్సై రాజు, వీరులపాడు ఎస్సై అనిల్, చందర్లపాడు ఎస్సై దుర్గా మల్లేశ్వర రావు లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాంతి భద్రతలు, తదితర విషయాలపై చర్చించారు.

## వరద బాధితుల సహాయార్థం దీపక్ నెక్స్ జెన్ ఫీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత రూ.కోటి విరాళం



**నూజివీడు, మేజర్ న్యూస్:** బాపులపాడు మండలం కొయ్యూరు గ్రామంలో ఉన్న దీపక్ నెక్స్ జెన్ ఫీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత సుబ్రహ్మణ్యం వరద బాధితుల సహాయార్థం కోటి రూపాయలు విరాళం ప్రకటించారు. ఈ మేరకు విజయవాడలో సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు స్వయంగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్‌ను అందజేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ వరద బాధితులకు విరాళాలు అందించే ప్రతి ఒక్కరికి అభినందనలు తెలియజేశారు. వరద బాధితులను ఆదుకోవడానికి ప్రతి ఒక్కరూ దాతృ హృదయంతో ముందుకు వచ్చి బాధితులను ఆదుకోవాలని కోరారు.

# జగ్గయ్యపేట - వైరా రహదారిని జాతీయ రహదారిగా మార్పుకు కృషి



**వత్సవాయి,సెప్టెంబర్ 9, మేజర్ న్యూస్ :** భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న జగ్గయ్యపేట - వైరా రోడ్డును జాతీయ రహదారిగా మార్పులకు కృషి చేస్తున్నట్లు రాష్ట్ర తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు టిడి జనార్ధన్ తెలిపారు. మునేటికి వచ్చిన వరదల కారణంగా ఈ రహదారిలోని లింగాల గ్రామంలో ఉన్న దెబ్బతిన్న మునేటి బ్రిడ్జిని సంబంధిత శాఖ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. పూర్తిగా ధ్వంసమైన ఈ బ్రిడ్జి మీద కాలినడకనే ప్రయాణిస్తూ ఈ బ్రిడ్జి దెబ్బతిన్న తీరును పరిశీలించారు. ఎస్ హెచ్ -192, 49కి.మీ త్వరగా మరమ్మత్తులు చేయాలని, ఎన్ హెచ్ 65 చిల్లకల్లు నుండి వైరా వద్ద నాగపూర్ - విజయవాడ ఎక్స్‌ప్రెస్ హైవే వరకు రాష్ట్ర రహదారిని జాతీయ రహదారిగా మార్చి లింగాల వద్ద పూర్తిగా దెబ్బతిన్న వంతెన స్థానంలో కొత్త వంతెన నిర్మించాలని రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖ మంత్రి బి.సి. జనార్ధన్ రెడ్డి తో మాట్లాడినట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో మునేటి ముంపుకు గురైన ఇండ్లను పరిశీలించారు. సంబంధిత బాధితులతో మాట్లాడి నష్ట వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధితుల పూర్తిస్థాయి నష్టపరిహారాన్ని నమోదు చేయవలసిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో జరిగిన నష్టం విషయంపై సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో జరిగిన నష్టాన్ని పూర్తిస్థాయిలో తగు నివేదికల ద్వారా వెంటనే అందజేయాలని సంబంధిత అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు తొండపు జగన్ మోహన్ రావు, ఎమ్మార్వో నరసింహారావు, ఎంపిడిఓ రాజు, ఆర్ అండ్ బి డిఈ పరుశురాం, ఇరిగేషన్ ఏఈ నరసింహారావు, విద్యుత్, ఆర్డబ్ల్యూఎస్ శాఖ అధికారులు,మండల కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.





## ఎమ్మెల్యేని మర్యాదపూర్వకంగా కలిసిన అధికారులు



**నందిగామ, సెప్టెంబర్ 9, మేజర్ న్యూస్:** పట్టణంలోని కాకాని నగర్ ఎమ్మెల్యే కార్యాలయంలో నియోజకవర్గ శాసనసభ్యులు తంగిరాల సౌమ్య ని నందిగామ పట్టణ సిఐ నాయుడు, తహసిల్దార్ ఎన్ సురేష్ బాబు, ఎస్సై శాతకర్ణి లు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు విషయాలు చర్చించారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాలో ఉన్న టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వరద బాధితులకు ప్రభుత్వ సహాయం



**చల్లపల్లి మేజర్ న్యూస్ :** వరద బాధితులకు ప్రభుత్వం మంజూరు చేసిన బియ్యం, నూనె, కందిపప్పు, పంచదార, ఉల్లిపాయలు, బంగాళదుంపలను పంపిణీ చేశారు. తహసీల్దార్ డి.వనజాక్షి ఆధ్వర్యంలో ఇన్చార్జి డీటీ ఘంటసాల కృష్ణమోహన్ పర్యవేక్షణలో ఆముదార్లంకలో 373 మందికి, చల్లప ల్లిలో 11 మందికి, లక్ష్మీపురంలో 15 మందికి, మంగళాపురంలో 10 మంది కి, మాజేరులో 66 మందికి మొత్తంగా 475 మందికి పంపిణీ చేపట్టారు. చల్లపల్లిలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఎంపీపీ కోట విజయ రాధిక, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, వీఆర్వోలు, కూటమి నేతలు పాల్గొ న్నారు. ఆయా గ్రామాల్లో జరిగిన పంపిణీ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, కూటమి నేతలు, అధికారులు పాల్గొన్నారు

## నేత్ర పరీక్షా శిబిరానికి విశేష స్పందన



**చల్లపల్లి,మేజర్ న్యూస్ :** బోలెం భాస్కరరావు ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హైదరాబాద్ సాయి దుర్గా కంటి హాస్పటల్ వారిచే రామానగరంలో జరిగిన ఉచిత నేత్ర పరీక్షా శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 200 మందికి పైగా నేత్ర సమస్యలున్నవారికి డాక్టర్ పూషడపు రామారావు పరీక్షలు నిర్వహించి ఉచితంగా ఐ డ్రాప్స్, మందులను అందచేశారు. ఐఓఎల్ ఆపరేషన్లు అవసరమైన వారిని గుర్తించారు. ట్రస్ట్ నిర్వాహకులు బోలెం రామారావు, బోలెం నాగమణి పర్యవేక్షణలో జరిగిన శిబిరాన్ని ఎంపీపీ కోట విజయ రాధిక, పైడిపాముల స్వప్న, వుప్పాల వీరాంజనేయులు, మోర్ల శివ, బి. కనకదుర్గ తదితరులు సందర్శించారు.

# గ్రామ పంచాయతీలకు రూ.లక్ష చెక్కుల పంపిణీ



**నందిగామ, సెప్టెంబర్ 9, మేజర్ న్యూస్ :** అధికార సంక్షోభం, వ్యవస్థల నిర్వీర్యం, వనరుల దోపిడీ గత వైసీపీ ప్రభుత్వం నుంచి వచ్చిందని ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో చంద్రబాబు పనిచేసిన తీరు అద్భుతంగా ఉందని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాటలను నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య గుర్తు చేశారు. ప్రకృతి విపత్తును ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు పరిపాలనా దక్షతతో అధిగమించారన్నారు. వరద వివిధ పంచాయతీలకు లక్ష చొప్పున విరాళం అందజేసిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పై పెద్ద ఎత్తున ప్రశంసల వర్షం కురిపించారు. సోమవారం నందిగామ పట్టణం కమ్మ కళ్యాణ మండపంలో కూటమి నేతల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సౌమ్య మాట్లాడుతూ, ఏపీ ప్రస్తుతమున్న విపత్కర పరిస్థితుల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిద్రాహారాలు మాని మరీ శ్రమించారన్నారు. ప్రజలను కష్టం నుంచి గట్టెక్కించేందుకు నిర్విరామంగా పని చేశారన్నారు. హుద్ హుద్ తుఫాన్ ను ఎదుర్కొన్న తీరును గుర్తు చేశారు. అదే విధంగా పవన్ కల్యాణ్ రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రి సహాయనిధికి రూ. కోటి చొప్పున ప్రకటించడం, అదేవిధంగా వరద ప్రభావంతో దెబ్బతిన్న ఏపీలోని 400 పంచాయతీలకు ఒక్కోదానికి రూ. లక్ష చొప్పున రూ.4కోట్ల సొంత నిధులను విరాళంగా ఇవ్వడం అభినందనీయమన్నారు. నందిగామ నియోజకవర్గంలో వరద పీడిత పంచాయతీలకు మంజూరైన చెక్కులను కూటమినేతలతో కలిసి పంపిణీ చేశారు. నియోజకవర్గంలో అకాల వర్షాలు వరదల కారణంగా దెబ్బతిన్న పంటలకు, ఇళ్లకు నష్టపరిహారం నమోదు కార్యక్రమాన్ని అధికారులు చేపట్టారని అన్ని విధాల అందరిని ఆదుకుంటామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఈనెల 21 వరకు ఫోటో ఓటర్ల జాబితా ఇంటింటి పరిశీలన

## కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** జిల్లాలో ఫోటో ఓటర్ల జాబితా ఇంటింటి పరిశీలన కార్యక్రమం ఈనెల 21 వ తేదీ వరకు కొనసాగుతుందని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలు ప్రకారం ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ కార్యక్రమం - 2025 లో భాగంగా గత ఆగస్టు నెల 21 వ తేదీ నుండి ఫోటో ఓటర్ల జాబితా ఇంటింటి పరిశీలన కార్యక్రమం బూతు స్థాయి అధికారులు నిర్వహిస్తున్నార న్నారు. ఓటర్ల జాబితాలో గాని, ఓటరు గుర్తింపు కార్డులో గాని తేడాలను ఈనెల 28 వ తేదీ నాటికి తొలగించడం జరుగుతుందన్నారు. అలాగే ఈనెల 28 వ తేదీ నాటికి ఫోటో ఓటర్ల జాబితాలోని సరిగా లేని ఫోటోల స్థానంలో బాగా నాణ్యత గల ఫోటోలను అప్లోడ్ చేయడంతో పాటు మానవ చిత్రాలు లేనివి తీసేసి సరైన చిత్రాలను పొందుపరచడం జరుగుతుందన్నారు అదేవిధంగా ఈనెల 28వ తేదీ లోగా వయసుకు తగిన విధంగా భావి జనాభాను ఈఆర్వో.నెట్లో తాజాగా రూపొందించడం జరుగుతుందన్నారు. ఏమైనా అంతరాలు ఉంటే గుర్తించి వాటిని సరి చేయడానికి ఈనెల 28వ తేదీలోగా సరి చేయడం జరుగుతుందన్నారు. ఈనెల 13వ తేదీలోగా అన్ని పోలింగ్ కేంద్రాల భవనాలను భౌతికంగా తనిఖీ చేయడం జరుగుతుందన్నారు. అలాగే ఈనెల 18 తేదీ నాటికి పోలింగ్ కేంద్రాల పునర్వ్యవస్థీకరణ గాని పునః ఏర్పాటు గాని చేస్తామన్నారు ఈనెల 18వ తేదీ నుండి మొదలుపెట్టి 23 వ తేదీ నాటికి భాగాలు, విభాగాల వివరాలను సరి చేస్తామన్నారు. ఈనెల 28వ తేదీ నాటికి ప్రతిపాదనలు సిద్ధం చేసి రాజకీయ పార్టీలకు అందజేయడం జరుగుతుందన్నారు. ఈనెల 30న జిల్లా ఎన్నికల అధికారి స్థాయిలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, శాసన సభ్యులు, పార్లమెంటు సభ్యులతో సమావేశం నిర్వహించి పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితా పై చర్చించాక వారి సలహాలు తీసుకోవడం జరుగుతుంద న్నారు వచ్చే అక్టోబర్ 3న ప్రస్తుతం ఉన్న పోలింగ్ కేంద్రాల మార్పుకు సంబంధించిన ప్రతిపాదనల జాబితా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారికి పంపడం జరుగుతుందన్నారు. వచ్చే అక్టోబర్ నెల 8వ తేదీన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి నుండి భారత ఎన్నికల సంఘానికి సమగ్ర పోలింగ్ కేంద్రాల జాబితా ఆమోదం కొరకు పంపడం జరుగుతుందన్నారు వచ్చే అక్టోబర్ నెల 14న పోలింగ్ కేంద్రాల జాబితా ఆమోదం పొందడం జరుగుతుందన్నారు. అక్టోబరు 18వ తేదీన ఫార్మాట్ 1 నుండి 8 వరకు సిద్ధం చేయడం జరుగుతుందన్నారు వచ్చే అక్టోబర్ 19వ తేదీ నుండి 28వ తేదీ వరకు సమగ్ర ముసాయిదా జాబితా, అనుబంధ జాబితాలు సిద్ధం చేయడం జరుగుతుందన్నారు. వచ్చే అక్టోబర్ నెల 29 వ తేదీన సమగ్ర ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించడం జరుగుతుందన్నారు. ఆ జాబితాపై అక్టోబర్ 29 నుండి నవంబర్ 28 వ తేదీ వరకు ఎవరైనా అభ్యంతరాలు గాని, క్లెయిములు గాని చేయవచ్చున్నారు. వచ్చే నవంబరు 9, 10, 23, 24 తేదీలలో శనివారము ఆదివారం ప్రత్యేక శిబిరాలను నిర్వహించి ఓటర్ల జాబితా పై అభ్యంతరాలు గాని, క్లెయిములు గాని స్వీకరిస్తామన్నారు. వచ్చిన క్లెయిములు గాని, అభ్యంతరాలు గాని ఈ ఏడాది డిసెంబరు 24 వ తేదీ నాటికి పరిష్కరించడం జరుగుతుందన్నారు. వచ్చే సంవత్సరం జనవరి 1 వ తేదీ నాటికి ఓటర్ల జాబితా తనిఖీ పూర్తి చేసుకుని, చివరి ప్రచురణ కోసం ఈసీఐ అనుమతి పొందడం జరుగుతుందన్నారు.వచ్చే సంవత్సరం జనవరి 6 వ తేదీన ఓటర్ల జాబితా చివరి ప్రచురణ చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో కొత్తగా ఓటర్ల నమోదు కోసం యువతను చైతన్యం చేసి జిల్లా వ్యాప్తంగా ఓటర్ల అవగాహన(స్వీప్) కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలన్నారు. ఇందులో భాగంగా ఈనెల 10వ తేదీలోగా వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, బూతు స్థాయి అధికారులతో సంబంధిత ఈఆర్వోలు సమావేశం నిర్వహించి బూత్ స్థాయి ఏజెంట్లను నియమించాలన్నారు.ఈ ఏడాది డిసెంబర్ 30వ తేదీ లోగా సాధారణ ప్రజలతో కూడా సమావేశం నిర్వహించి ఇంటింటి ఓటర్ల జాబితా పరిశీలించి ఇల్లు మారిన ఓటర్లను, మృతి చెందిన ఓటర్లను గుర్తించాలన్నారు.ముసాయిదా ఓటర్ల జాబితా తయారు చేసేంతవరకు వారానికి ఒకసారి బూతు స్థాయి అధికారులు ఎవరో తెలియచెప్పాలన్నారు. వచ్చే నవంబర్ నెల 28వ తేదీ లోగా అన్ని విద్యాసంస్థల అధిపతులతో సమావేశాలు నిర్వహించి ఫారం-6 దరఖాస్తులను అందజేసి అర్హులైన విద్యార్థులు అందరూ కొత్త ఓటర్లుగా పేర్లు నమోదు చేసుకునేలా చూడాలన్నారు. అలాగే వచ్చే నవంబర్ 30వ తేదీ వరకు విద్యాసంస్థల తో పాటు క్యాంపస్ అంబాసిడర్లు, వివిధ ప్రభుత్వ శాఖలు, ఎన్ఎస్ఎస్, ఎన్వైకే, సంక్షేమ సంఘాలు, స్వయం సహాయక సంఘాలు, మీడియా సంఘాలు, క్షేత్ర ప్రచార విభాగాలు, యువజన సంఘాలు అన్నిటిని భాగస్వాములుగా చేసి స్వీప్ కార్యక్రమాలను ముమ్మరంగా అమలు చేయాలన్నారు. వచ్చే నవంబర్ 24 వ తేదీ లోగా స్వీప్ అవగాహన కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను విస్తృతంగా పంపిణీ చేయాలన్నారు. ఈనెల 10 తేదీ నుండి వచ్చే నవంబర్ 28 వ తేదీలోగా మండల స్థాయిలో 2 కిలోమీటర్ల పరుగు పందెం, నియోజకవర్గస్థాయిలో 3 కిలోమీటర్ల పరుగు పందెం నిర్వహించాలన్నారు. ఈనెల 10 వ తేదీ నుండి వచ్చే నవంబర్ 20 వ తేదీలోగా ఓటు విలువలు, భారతీయ ప్రజాస్వామ్యం - యువత పాత్ర, ఓటర్ల సంస్కరణలు అనే అంశంపైవ్యాసరచన, వక్తృత్వ పోటీలను విద్యాసంస్థలు, మండల, నియోజకవర్గ స్థాయిల్లో నిర్వహించాలన్నారు. వచ్చే నవంబర్ 9 వ తేదీ నుండి 28 వ తేదీ వరకు వారానికి ఒకసారి థర్డ్ జెండర్, దివ్యాంగులు, భావి తరాల ఓటర్ల గురించి 18-19 సంవత్సరాల వయసు గల యువత కోసం ప్రత్యేక అవగాహన శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యమైన కూడళ్లలో వచ్చే అక్టోబర్ 2 వ తేదీన మానవహారాలను ఏర్పాటు చేయాలన్నారు. వచ్చే నవంబర్ 9వ తేదీ నుండి 28వ తేదీ వరకు వారానికి ఒకసారి మహిళల కోసం ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి కళాశాల విద్యార్థులు కొత్త ఓటర్లుగా నమోదయ్యేందుకు కృషి చేయాలన్నారు. ఈనెల 15న విద్యాసంస్థల్లో మండల, నియోజకవర్గ స్థాయిల్లో రంగోలి పోటీలు నిర్వహించాలన్నారు. అంతే కాకుండా కళాశాల విశ్వవిద్యాలయ విద్యార్థులతో సంతకాల శిబిరాలు, ద్విచక్ర వాహనాల ర్యాలీలు ఏర్పాటు చేయాలన్నారు.వచ్చే నవంబర్ 25 వ తేదీ వరకు ప్రధాన కేంద్రాలు, ప్రజలు గుమిగూడే ప్రదేశాలు, కళాశాలల్లో స్వీప్ బ్యానర్లు, హోర్డింగులు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే వచ్చే నవంబర్ 25వ తేదీ వరకు వారానికి ఒకసారి ఈ ఆర్ ఓ లు, ఏ ఈ ఆర్ ఓ లు మండల స్థాయిలోని బస్టాప్ లు, రైల్వే స్టేషన్లు, రైతు బజార్లో, షాపింగ్ మాల్ లో ఆన్లైన్ ఓటర్ల నమోదు సౌకర్య కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ అవకాశాన్ని నేటితరం యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

# వరద ప్రభావిత 66 సచివాలయంలో పూర్తయిన 100% పారిశుధ్య నిర్వహణ



బుడమేరు వంతెన దగ్గర పేరుకుపోయిన వ్యర్థాలను తొలగిస్తున్న వీఎంసీ సిబ్బంది




61వ డివిజన్ వాటర్ ట్యాంక్ రోడ్ వద్ద....రోడ్డు మీద పడి ఉన్న భారీ వృక్షాన్ని తీసి పరిశుభ్రపరుస్తున్న ఉద్యానవన కార్మికులు



ఉలవచారు ఫ్యాక్టరీ గుణదల వద్ద గుర్రపు డెక్కని తొలగిస్తున్న విజయవాడ నగరపాలక సంస్థ బృందం

## అతి త్వరలో వరద ప్రభావితమైన మిగిలిన సచివాలయాల్లో కూడా 100% పారిశుధ్య నిర్వహణ పూర్తి చేస్తాం

## నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర

**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** వరద ప్రభావితమైన 149 సచివాలయాల్లో, సోమవారం సాయంత్రం నాలుగు గంటల వరకు 66 సచివాలయాల్లో పూర్తిగా 100% పారిశుధ్య నిర్వహణ జరిగిందని, పురపాలక, పట్టాభివృద్ధి శాఖ నుండి 32 ఐఏఎస్ ఆఫీసర్లు వార్డ్ స్పెషల్ ఆఫీసర్లుగా 149 ఆఫీసర్లు వార్డ్ సచివాలయ స్పెషల్ ఆఫీసర్లుగా, 62 పారిశుధ్య నోడల్ ఆఫీసర్లు, 950 శానిటేషన్ సూపర్వైజర్లు, 6830 పారిశుధ్య కార్మికులతో ప్రతిరోజు వరద ప్రభావిత ప్రాంతాలలో పారిశుధ్య నిర్వహణ శరవేగంగా జరుగుతుందని కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర సోమవారం ఉదయం వరద ప్రభావిత ప్రాంతాలైన ఒకటవ డివిజన్లోని గుణదల ఇన్నర్ రింగ్ రోడ్, 64వ డివిజన్లోని కండ్రిక జంక్షన్లో పర్యటించి వరద ప్రభావిత ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుధ్య నిర్వహణ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వరద ప్రభావిత ప్రాంతాలలో 234 త్రాగునీటి టాంకర్లతో ప్రజలకు సురక్షితమైన త్రాగునీటిని సరఫరా చేస్తున్నారని, పారిశుధ్య నిర్వహణకై 154 ట్రాక్టర్లు, 100 టిప్పర్లు, 59 జెసిబీలు, 14 బాబ్ కాట్లు, 10 డోజర్లు, ఆరు ప్రోక్ లైనర్లు, రెండు క్రేన్లు, 25 కంపెక్టర్లతో మొత్తం 370 వాహనాలతో పారిశుధ్య నిర్వహణ జరుగుతుందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు వరద ప్రభావిత ప్రాంతాలలో బురద పేరుకుపోయి ప్రజలు ఇబ్బంది పడుతుంటారు కాబట్టి వాళ్లకు ఆ సమస్యను దూరం చేసేందుకు 110 ఫైర్ ఇంజన్ తో 30545 ఇళ్లను ఫైర్ గన్స్ తో శుభ్రపరిచారని, లోతట్టు ప్రాంతాలలో ఉన్న వరద నీరును బయటకు తీయడానికి 238 డి వాటరింగ్ పంపులు నిత్యం పనిచేస్తున్నాయని అన్నారు. వరద ప్రభావిత ప్రాంతాలలో 458 కిలోమీటర్ల రోడ్లలో దాదాపు 90 శాతం రోడ్లను శుభ్రపరిచారని, 574 మెట్రిక్ టన్నుల వ్యర్థాలను తీశారని, ప్రజలు అనారోగ్య పాలు కాకుండా ప్రతిరోజు బ్లీచింగ్ పౌడర్ డ్రోన్ల ద్వారా, పారిశుధ్య కార్మికుల ద్వారా చేస్తున్నారని 88.62 మెట్రిక్ టన్నుల బ్లీచింగ్ పౌడర్ వేశారని అన్నారు. ప్రతిరోజు డ్రైన్లను డీసిల్టింగ్ చేస్తున్నారని ఇప్పటివరకు 534 కిలోమీటర్లలో 421 కిలోమీటర్లు డీసిల్టింగ్ చేశారని అన్నారు. నిల్వ ఉన్న వరద నీళ్లలో 20 డ్రోన్ల సహాయంతో బయో ఎంజీమ్, మలేరియా లార్వాసైడ్ ఆయిల్ ప్రతిరోజు స్ప్రే చేస్తున్నారని అన్నారు.







18 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999